## కేసీఆర్‌ను కలిసిన నాగేందర్‌గౌడ్



వికారాబాద్, డిసెంబర్ 7 : ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## వేగంగా పనులు పూర్తి చేయాలి

### కలెక్టర్ భారతిహోలీకేరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోలీకేరి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 7 : రూర్బన్‌స్కీం ద్వారా కేటాయించిన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ భారతిహోలీకేరి అన్నారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ భవనంలో కలెక్టర్ చాంబర్‌లో రూర్బన్‌స్కీం ద్వారా కేటాయించిన పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భారతిహోలీకేరి మాట్లాడుతూ.. రూర్బన్‌స్కీం ద్వారా చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండలంలో చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణం, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ, కిచెన్‌షెడ్స్, పంచాయతీ భవనముల నిర్మాణం వంటి వివిధ రకాల అభివృద్ధి పనులపై సమీక్షించారు. పూర్తికాని పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, ఈఈ పీఆర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈఈడబ్ల్యూ కుమార్, ఈఈ ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌పల్లి, ఎంపీడీవో వెంకటయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 'పల్లె పోరు'కు కసరత్తు




- పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్
- సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్‌కు ఎస్ఈసీ ఆదేశాలు
- సిబ్బంది, పోలింగ్ కేంద్రాల వివరాల సేకరణ
- ఈ నెల 30లోపుగా ఆర్‌వోలు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు
- రంగారెడ్డి జిల్లాలో 558 పంచాయతీలు, 4,992 వార్డులకు ఎన్నికలు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటిన ముగియనున్న సర్పంచుల పదవీ కాలం

రంగారెడ్డి, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): 'గ్రామపంచాయతీల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తున్నది. పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు నిర్వహించగా.. సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటిన ముగియనున్నది. ఈ నేపథ్యంలో జిల్లాలో గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. సిబ్బంది, పోలింగ్ కేంద్రాల వివరాల సేకరణ ప్రక్రియను చేపడుతూనే..ఈ నెల 30లోపుగా ఆర్‌వోలు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఎన్నికల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 558 పంచాయతీలు, 4,992 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. గతంలో మూడు విడుతల్లో ఎన్నికలను నిర్వహించారు. ఈసారి సైతం ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహించాలనే దానిపై జిల్లా అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోనున్నది.'

**200 ఓటర్లకు పోలింగ్ కేంద్రం..**

ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు ప్రతి 200 మంది ఓటర్లకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారిని నియమించాల్సి ఉంటుంది. 201నుంచి 400 మంది ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 మంది ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాలి. నిర్ణీత సంఖ్యకు అదనంగా 20 శాతం సిబ్బందిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. ప్రతి వార్డులో విధిగా ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా..650 మంది ఓటర్లు దాటితే రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. దీంతో ఈసారి పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల సంఖ్య గతంలో కంటే పెరగనున్నది.

**మూడు దశల్లో ఎన్నికలు..**

గతంలో మాదిరిగానే మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో 558 పంచాయతీలు, 4,992 వార్డులు ఉన్నాయి. పాలకవర్గాల కాల పరిమితి వచ్చే ఏడాది ఫిబ్రవరి1 నాటికి ముగియనుంది. ఇంకా..సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం 53 రోజుల సమయం ఉంది. ఈలోగా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. కొత్త ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పచ్చ జెండా ఊపితే మరో సంగ్రామానికి నగారా మోగనుంది. ఐదేళ్ల కింద జరిగిన పద్ధతిలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశాలు ఉన్నాయా ? లేక మార్చుతారా! అన్నదానిపై కూడా త్వరలోనే ఓ స్పష్టత రానుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నవీకరించిన జాబితానే పంచాయతీ ఎన్నికల్లో పరిగణనలోకి తీసుకుంటారా? లేక మరోసారి ముసాయిదా విడుదల చేసి కొత్తగా దరఖాస్తులను స్వీకరిస్తారా? అనేది కూడా తెలియాల్సి ఉంది.

**ఎన్నికల సిబ్బంది కోసం 'టి-పోల్' సాఫ్ట్‌వేర్..**

అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బంది వివరాల జాబితా కలెక్టర్ కార్యాలయంలో సిద్ధంగా ఉండడంతో అదే జాబితాతో ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేయనున్నట్లు తెలుస్తున్నది. ఉద్యోగుల సంఖ్య సరిపడా లేని పరిస్థితుల్లో ప్రభుత్వ రంగ సంస్థలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, గురుకులాలు, ఎయిడెడ్ పాఠశాలలు, ఇతర సంస్థల సిబ్బందిని ఎన్నికల విధులకు కేటాయించనున్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎంపిక కోసం ఈసారి 'టి-పోల్' సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. సిబ్బంది పేరు, ఎంప్లాయి కోడ్, ఫోన్ నంబరు, హోదా, వేతన స్కేల్, సొంత మండలం, ప్రస్తుతం పనిచేస్తున్న చోటు తదితర వివరాలను సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చనున్నారు. ఎన్నికలు మూడు దశలో జరిగితే.. తొలి దశలో వినియోగించుకున్న సిబ్బందిని మూడో దశలోనూ వినియోగించనున్నారు.

# ఇక.. స్థానిక సమరం

- పంచాయతీ ఎన్నికలకు కసరత్తు షురూ
- ఈనెలాఖరులోగా ఎన్నికలకు సరిపడా సిబ్బంది జాబితా సిద్ధం
- 2019 ఫిబ్రవరి 1న బాధ్యతలు చేపట్టిన ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాలు
- జిల్లాలో 566 పంచాయతీలు... 4858 వార్డులు




వికారాబాద్, డిసెంబర్ 7, (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కసరత్తు షురూ అయింది. ఈ మేరకు ఈనెలాఖరులోగా ఎన్నికలకు సరిపడా ఉద్యోగులు, సిబ్బంది జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఆదేశించడంతో జిల్లా పంచాయతీ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1తో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగియనున్న దృష్ట్యా అప్పటిలోగా ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. 2019 ఫిబ్రవరిలో ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గడువులోగా ఎన్నికలను నిర్వహించనట్లయితే ప్రత్యేకాధికారుల పాలన విధించాల్సి ఉంటుంది, అయితే ప్రత్యేకాధికారుల పాలనలో పాలన కుంటుపడే పరిస్థితులున్న దృష్ట్యా గడువులోగా ఎన్నికలను నిర్వహించేందుకుగాను ఏర్పాట్లకుగాను కలెక్టర్లను ఆదేశించారు. గడువు సమీపిస్తున్న దృష్ట్యా అధికారులు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి చర్యలు వేగం చేశారు. మార్చిలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తారా ఏప్రిల్ వరకు వాయిదా వేస్తారనేది మరో వారంలోగా స్పష్టత రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఎన్నికల నిర్వహణకు కసరత్తు..**

జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు ఎంతమంది సిబ్బంది అవసరమనేది గుర్తించే పనిలో సంబంధిత అధికారులు షురూ చేశారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకుగాను మొదట గ్రామ పంచాయతీలకు సరిపడా ఉద్యోగులు, సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లోని వార్డులకు ఎంతమంది సిబ్బంది అవసరమనేది గుర్తిస్తారు. అయితే ఆయా పంచాయతీల్లోని ఓటర్ల సంఖ్యను బట్టి ఎన్నికల సిబ్బందిని నియమిస్తారు. ప్రతి 200 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ఒక పోలింగ్ అధికారిని నియమిస్తారు. అదేవిధంగా 201 నుంచి 400 మంది ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 మంది ఓటర్ల నుంచి 600 వరకు ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. ఈ విధంగా జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల సంఖ్యను బట్టి ఎంత మంది అధికారులు, సిబ్బంది అవసరమనేది గుర్తించనున్నారు. అధికారులు, సిబ్బందితో కూడిన పేర్ల జాబితాను సిద్ధం చేసి ఎన్నికల సంఘానికి అందజేయనున్నారు. ఎన్నికల సంఘం జాబితాకు ఆమోదముద్ర వేసిన అనంతరం సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బందికి జిల్లా ఉన్నతాధికారులు బాధ్యతలను అప్పగించనున్నారు. గడువు సమీపిస్తున్న దృష్ట్యా చకచకా ఏర్పాట్లు జరిగే అవకాశాలున్నాయి.

**జిల్లాలో 566 పంచాయతీలు...4858 వార్డులు..**

జిల్లాలోని 566 గ్రామ పంచాయతీలు, 4858 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. బంట్వారం మండలంలో 11 గ్రామ పంచాయతీలు, బషీరాబాద్ మండలంలో 36 గ్రామ పంచాయతీలు, బొంరాసుపేట్‌లో 47 గ్రామ పంచాయతీలు, ధారూర్‌లో 32, దోమ మండలంలో 36, దౌల్తాబాద్ 33, కొడంగల్ 26, కోట్‌పల్లి 18, కులకచర్ల 44, మర్పల్లి 27, మోమిన్‌పేట 28, నవాబుపేట 32, పరిగిలో 37, పెద్దేముల్ 37, పూడూర్ 31, తాండూర్ 33, వికారాబాద్ 21, యాలాల మండలంలో 37 గ్రామ పంచాయతీలున్నాయి. గత ఎన్నికల్లో 400లకుపైగా పంచాయతీలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రతి గ్రామంలో ప్రత్యేకంగా కమిటీలున్న నేపథ్యంలో ఈ దఫా ఎన్నికల్లోనూ అత్యధిక పంచాయతీల్లో గులాబీ జెండా ఎగురవేసే పరిస్థితులున్నాయి.

## విద్యా వ్యవస్థ బలోపేతానికి సహకారం అందిస్తాం

### ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పర్వతరెడ్డి

పరిగి, డిసెంబర్ 7 : రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వానికి సహకరిస్తూ ఉపాధ్యాయ సమస్యలు సాధించుకుంటామని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి పేర్కొన్నారు. గురువారం పరిగిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, బకాయిలుగా ఉన్న మూడు డీఏలు, 317 జీవోకు సంబంధించి, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు వంటి అంశాలన్నింటినీ నూతన ప్రభుత్వం చిత్తశుద్ధితో అంశాలపై సమగ్ర ప్రణాళికతో జాప్యం లేకుండా పూర్తి చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు. విద్యా వ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వంతో తమవంతు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎస్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డీ.షఫి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దయాకర్, శ్రీనివాసరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.